# పరిశోధన

రాత్రి తొమ్మిది గంటలయింది. ఇంకో గంటలో సినిమా వదిలేస్తారు. అప్పటికే తాను టౌన్ చుట్టూ రెండుసార్లు చుట్టివచ్చాడు. ఈ రెండుచుట్లలోనూ అన్నివీధులూ అన్నిగొందులు కలియతిరిగినట్టే. ఫలితం మాత్రం రోజూలాగానే శూన్యం. ఆ విసుగుతోనే వచ్చి సినీమాహాల్లో జొరబడ్డాడు. టిక్కెట్టు డబ్బులతో పని లేదుగనుక అలవాటుప్రకారం బాల్కనీలోకే వెళ్లాడు. అన్ని ఖాళీ కుర్చీల్లోనూ ఒకదాంట్లో అనుకోకుండానే చేరగిలబడ్డాడు.

కూర్చున్నాకగాని తెలియలేదు అతనికి 'చాలా అలిసిపోయినట్టు' — ఆ సినీమాసంగతీ అప్పుడే తెలిసింది. అదే హాలులో అదేసినిమా అదేబాల్కనీనుంచి సవాలక్షసార్లు చూచాడు. ఐనా అలాగే కాళ్ళుబార్లాచాపాడు. బుర్ర వెనక్కి వేళ్లాడేశాడు. కళ్ళు గట్టిగా మూసుకుని సినిమా చూస్తున్నాడు. వాల్చేసిన బుర్ర ఎక్కడెక్కడో తిరుగుతోంది. కాళ్లు కదలడంలేదు.

ఉక్కబోస్తోంది. పైన పంకా పనిచేయడం లేదు. క్రింద నల్లులు పనిచేయడం మాననూలేదు.

గభీమని లేచాడు. గబ గబా క్రిందికి దిగాడు. హాలు బయటికి వచ్చాడు. వరండాలో అటూ ఇటూ తిరుగుతున్నాడు. తలకాయలో ఆలోచనలు అంతకంతే ఘోరగుతున్నాయి. బూట్లు 'టక్ టక్' తాళం కొడుతున్నాయి. గుండెలు అంతకంతే వేగంగా కొట్టుకుంటున్నాయి. ఆందోళన ... ఒకటే ఆందోళన.

తాను వెతుకుతూనే వున్నాడు. పగలులేదు. రాత్రిలేదు. పట్నమంతా దినమూ పదిసార్లేనా కలదిరిగి వదుల్తున్నాడు. గాలించేస్తున్నాడు. సైకిల్ టైర్లు అరిగిపోతున్నాయి. కాళ్లల్లో సత్తువ కరిగిపోతూవుంది. ఫలితం మాత్రం శూన్యం.

ఇంతకూ తన దురదృష్టం. అంచెమీద అంచె అలాఅలా పైకిపోయే అదృష్టం తనకి పట్టలేదు.

వరండాలో ఆ చివరనించీ యీ చివరకూ యీ చివరనుంచీ ఆ చివరకూ—తిరిగి తిరిగి ఆకస్మికంగా కాళ్లు ఆగి వూరుకున్నాయి. ఆసంగతి అతనికేమీ తెలియదు. మూడు నిప్పు పుల్లలు ఖర్చై ఓ సిగిరెట్టు కాలింది. పొగలు క్రక్కుతున్నది. అదీ అతనికేమీ తెలియదు.

హాలుగేటులో, ఆ వైపు వరండాలోనే ఓ నీడ కదలింది. అతని కళ్లు పసికట్టేశాయి. గాజులు గల్లుమని మోగాయి. అతని చెవులు విన్నాయి. యిప్పుడు

మనస్సు పనిచేయడం ప్రారంభించింది. ప్రారంభించడమే తరువాయి అనుమానించింది. అనుమానించడం ఆ మనస్సుకు అలవాటే. 'అనుమానం' నుంచేగదా! పరిశోధనలు ఫలించేదీ.

ఆ నీడ ఆడరూపంలో బయటపడింది.

అతగాడికళ్లు టప టపా కొట్టుకున్నాయి. అతగాడి బుర్ర చక చకా తనపని తాను చేసుకుపోతోంది – 'ఏవరిదీ ?'

ఆ ఆడరూపం ఒక్కసారిగా ఇతన్ని చూచి జడుసుకొంది.

'ఆడవాళ్ళవేపు వరండాలో యిదేమిటి ? మగాడు ! పోలీసు డ్రెస్ తొడుక్కున్న ఆడదా ?!' గబగబా క్రీనీడలో నడిచిపోతోం దా అమ్మాయి.

'అలా క్రీనీడలో ఎందుకు నడుస్తోంది ?'

అనుమానానికి ఆధారాలు వెతుకుతోంది అతనిమనస్సు.

ఆ యమ్మాయి వెనక్కుతిరిగి చూచింది.

అతనికళ్లు అటే చూస్తున్నాయి.

'అదేమిటె, అలా గుడ్లుపెట్టుకు చూస్తాడు. నెత్తిమీాద ముసుగు లాక్కుంది.

తోంది.

'ఎందుకంతభయం, అడుక్కుంటోంది తన్ని తనే అతగాడి మనస్సు.

'ఆ యమ్మాయి తిరిగి తిరిగి చూస్తోంది, పోతోంది.

'ఏమిటిది? ఆ యమ్మాయి ఎందుకలా బిత్తర పోతోంది? తాను పోలీస్ఉద్యోగి. తననిచూచి దొంగలు ......భయపడతారు. ఈ యమ్మాయి దొంగకావాలి. లేదా ... కుచ్చిళ్ళు కొంచెం పైకిలాగి పట్టినట్టు నడుస్తోంది ఆయమ్మాయి.

ఆఁ! ఆ యమ్మాయి దొంగకాదు. కానే కాదు. తేలిపోయింది. ఈ యమ్మాయి...ఆ యమ్మాయి దగ్గర ఏవో రహస్య పత్రాలు వుండివుండాలి. అవి కుచ్చిళ్లల్లో వుండివుండాలి. తాను వరండా కాయడం చూచి 'దొరికిపోయాన'ని భయపడి వుండాలి. అందుకే అలా జాగ్రత్త పడబోతోంది. ఆ తిరిగి తిరిగి చూడటం అందుకే. ఆ భయం అందుకే. అమ్మయ్య! దొరికిపోయింది. తన పరిశోధన ఫలితానికి వచ్చేసింది.'— అతగాడి మనస్సు యింత ఆలోచనా ఓ అరక్షణంలో చేసేసింది.

ఆ యమ్మాయి హాలు మలుపు తిరిగింది.

పోతోంది. పోతోంది. ఐనా చుట్టూ పెద్ద ప్రహరీ గోడలున్నాయి. ఐనా-'ఆలస్యాదమృతం విషం.'

అతగాడి కాళ్లు వెంబడించాయి. పిల్లి కాళ్లలాగా మెత్తగా—

'ఏదీ?' అతనికళ్లు అన్నివైపులకూ గిరగిరా తిరిగాయి. అంతా చీకటి?

'అదుగో!' మరుగుదొడ్డిలో గోడమీదుగా తల కాన్పించింది. అంతలో మాయమయ్యింది.

'ఉహూ' కూర్చొంటోందన్న మాట. 'ఎలాగా దొరికిపోయాగదా!' అని ఆ వుత్త రాల్ని వుచ్చలదొడ్లో పూడ్చబోతోందన్న మాట.

మెల్లగాపోయి మరుగుదొడ్డివాకిలి కాచాడు.

'ఆ వుత్తరాలు ఏ రహస్య నాయకుడి కోసం తెస్తోందో? అన్నీ ఒక్క క్షణంలో తేలిపోతాయి.' —కాళ్లు నిలదొక్కుకున్నాడు. రివాల్వర్ పైకితీశాడు. సిద్ధంగా వున్నాడు.

''బుజ్ జ్ జ్'' మని మోత వస్తోంది. దొడ్లో నించి —

అదిరిపడ్డాడు. చేతిబాంబులాంటి మారణాయుధమో? ఏమిటో ఖర్మ —

గుండెలు గుబ గుబమన్నాయి. యింట్లో దోమతెర మంచంలో పడున్న భార్య గుర్తుకొచ్చింది. ఉయ్యాలతొట్లో పాప కెవ్వుమన్నట్టుంది.

పరిశోధన ఫలితాని కొచ్చింది. ఫట్ మని తాను పైకిపోతాడు. మామూలు పోలీసునుంచి ఒక్కో మెట్టే ఎక్కాడు. హెడ్డూ, రైటరూ మధ్య చక్కర్లు కొట్టాడు. కొట్టి కొట్టి 'సబ్బయ్యాడు.' ఏళ్లకు ఏళ్లుగా ఒకటే సబ్బు. వెధవ సబ్బు. ఏమైనా సరే. యీ దెబ్బతో ఫట్‌మని పైకిపోవాలి.

ఆ ఆశతోనే జారిన గుండెని అసలు స్థానం లోకి తోసేశాడు. వణికే రివాల్వర్ని గట్టిగా గుప్పెట్లో బిగించాడు. పూనికచేసి నిల్చున్నాడు.

'బుజ్ జ్ జ్.' ఒకటే బుజ్ జ్ — ఎంతకూ పేలదేం? వెధవ బాంబు. గుండెలు పీకుతూ ఎంత సేపిలా?'

ఐనా చూతామని భయం భయంగానే తొంగి చూచాడు.

"ఛీ పాడుముండా ఆడది" అతనికే సిగ్గేసింది. గిరుక్కున తిరిగాడు. లెఫ్ట్ రైట్ మరిచేపోయి ఒకే పరుగు తీశాడు. ఒక్క దూకులోపోయి బాల్కనీలో జొరబడ్డాడు.

ఎంత సిగ్గుచేటు – ఓ ఆడది మరుగుదొడ్లో... ఆ బుజ్ జ్ జ్‌కు తాను హడిలిపోతాడా?

♦ ♦ ♦ ♦ ♦ ♦

అక్కడ ఆవిడ కేకలు పెడుతోంది. 'ఎవడో

బూట్లు మోగించుకుంటూ తన్నేదో చెయ్యవచ్చా' దని-

ఇక్కడ ఈయన తన తెలివితక్కువ తనానికి విచారపడుతున్నాడు :- "వెనుకా ముందు లేకుండా కాల్చిపారేసి 'కమ్యూనిస్ట్' అన్నట్టైతే అందరిలాగా తానూ సర్కిల్ ఐవుందునే? ' అని —

---

<u>అమ్మమ్మ ఉవాచ :-</u>

"మానాభిమానంబులు దేహానికేగాని ఆత్మకు కావురా. పిచ్చివాడా! ప్రతి అవమానానికీ ఆత్మహత్య చేసుకుంటే మన పెద్ద పెద్ద జాతీయనాయకులంతా యీ పాటికి ఒక్కొక్కరూ లక్షసార్లు చచ్చివుండాల్సింది."